క్లుప్తంగా

భూహక్కుదారులకే భూసర్వేలో న్యాయం

● నర్సీపట్నం ఆర్డీవో జయరాం


హద్దు రాళ్లు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

రోలుగుంట: భూహక్కుదారులకే అర్హతల ఆధారంగా ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేలో పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆదేశించారు. ఎం.కె.పట్నం రెవెన్యూ పరిధి పనసలపాడు గిరిజన గ్రామాల్లో సర్వే పూర్తయిన రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఇక్కడ సర్వేరాళ్లు పాతిన భూములను ఇన్‌చార్జి తహసీల్దార్ హెచ్.త్రివేణితో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అక్కడ రైతులను రప్పించి రాళ్లు పాతిన విధానంపై చర్చించారు. అందరితోను మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు.

బోధనోపకరణాల కిట్ల పంపిణీ


కిట్లు పొందిన దివ్యాంగ విద్యార్థులు

రావికమతం: స్థానిక భవిత కేంద్రంలోని 23 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.2.30 లక్షల విలువ చేసే బోధనోపకరణాల కిట్లను అందించారు. గురువారం చోడవరంలో అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త శకుంతల, జాతీయ మేధోపర వైకల్య సాధికార సంస్థ సికింద్రాబాద్ ప్రతినిధులు సిజుత్, శ్రీకాంత్ వీటిని అందజేశారు. ఈ కిట్లను ఉపయోగించి బోధించడం వల్ల బుద్ధి మాంద్యం గల దివ్యాంగ విద్యార్థుల మేధా వికాసాన్ని పెంపొందించవచ్చని మండల ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథ నాయుడు తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

కె.కోటపాడు: సూదివలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఐదేళ్లకోమారు అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. పండగ కారణంగా గ్రామాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ ఆదిరెడ్డి రాము నాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో పోటీలు


ఖో-ఖో పోటీలో విద్యార్థినులు

కె.కోటపాడు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ఉత్సవాల ముగింపు రోజు వచ్చే నెల 11న బహుమతులను అందించనున్నట్లు పద్మావతి తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపితే ఉద్యోగావకాశాల్లో అదనపు ప్రయోజనం పొందుతారన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి చేయూత


బాధితురాలికి బియ్యం, నగదు అందిస్తున్న దృశ్యం

గొలుగొండ: ఇటీవల గొలుగొండ పంచాయతీ శివారు పేటమాలపల్లిలో ప్రమాదశాత్తు ఇల్లు కాలిపోయిన అల్లంపల్లి అచ్చియ్యమ్మకు సర్పంచ్ కలిపల్లి అప్పారావు, ఎంపీటీసీ చినపాప ఆర్థిక సాయం అందించారు. గురువారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు, నిత్యావసర సరుకలు అందించారు. ఇల్లు కాలిపోవడంతో ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

ఉరుములు, మెరుపులతో బెంబేలు

చోడవరంలో భారీ వర్షం


చోడవరంలో కురుస్తున్న వర్షం


సీతంపేట దళిత కాలనీలో ఇంటి ముందు భారీగా చేరిన వర్షపు నీరు


దేవరాపల్లి జేసీబీ సహాయంతో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


విరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఏఈ శంకరరావు

చోడవరం: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. వీటితోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. చోడవరం పరిసరాల్లో గురువారం కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ మండిపోగా సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీచాయి. ఈ క్రమంలో భారీ వర్షం కురవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. నర్సాపురం, అంబేరుపురం, ఖండిపల్లి ప్రాంతాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కొంత మేర ఒరిగిపోయాయి. ప్రధాన రహదారిలో గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు చాలా ఇబ్బంది పడ్డారు. పట్టణంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఒక్కసారిగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాలతోపాటు రోడ్లపైన వర్షపు నీరు భారీగా చేరింది. నాగయ్యపేట పంచాయతీ శివారు సీతంపేటలో లోతట్టు ప్రాంతం దళిత కాలనీలోకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో పలువురు ఇళ్ల ముంగిట భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా ఎక్కడికక్కడ ప్రవహించేలా తగు పరిష్కార మార్గం చూపించాలని దళిత కాలనీ వాసులు కోరుతున్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

దేవరాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సవానికి మండల వ్యాప్తంగా 34 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అదేరోజు రాత్రికి దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించారు. పలు గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు గురువారం ఉదయం నుంచి స్థానిక ట్రాన్స్‌కో ఏఈ కె. శంకరరావు నేతృత్వంలో విద్యుత్ సిబ్బంది విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవితోపాటు తెగిన తీగలను సైతం అతికించే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం వర్షం కురవడంతో ఈ పనులకు కాస్తా అంతరాయం ఏర్పడింది.

సచివాలయాల్లో ప్రజలకు మరిన్ని సేవలు

● భోగాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ


భోగాపురంలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

చోడవరం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల మంజూరుపై ఆరా తీశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సచివాలయం, వలంటీర్ల పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారత ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అనంతరం రూ.22 లక్షలతో నిర్మించిన వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రం, రూ.17.5 లక్షలతో నిర్మించిన భారత నిర్మాణ సేవా కేంద్రం భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, ఎంపీటీసీ ఆడారి కోటిభూలోక, మాజీ ఎంపీటీసీ దొడ్డి రమణారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొండలెక్కి దిగిన ప్రజా ప్రతినిధులు

చలిసింగం రోడ్డు ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల పరిశీలన


కొండలెక్కుతున్న రెండు మండలాల ప్రజా ప్రతినిధులు

రావికమతం: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు రెండు కొండలవతల ఉన్న చలిసింగం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించేందుకు సాధ్యాసాధ్యాలను రెండు మండలాల ప్రజాప్రతినిధులు గురువారం పరిశీలించారు. రావికమతం, రోలుగుంట ఎంపీపీలు పైల రాజు, యర్రంశెట్టి శ్రీనివాసరరావు, సర్పంచ్ వంజరి గంగరాజు, ఎంపీటీసీ గాలి రమణబాబు తదితరులు ఆ గ్రామానికి వెళ్లేందుకు కొండలెక్కి దిగారు. రావికమతం మండలం శివారు గ్రామానికి రహదారి నిర్మించేందుకు చీకాయపాడు నుంచి ఘాట్ వేయాల్సి ఉండటంతో అటవీ అనుమతులు రాక కొన్నాళ్లుగా సాధ్యం కావడం లేదు. రోలుగుంట మండలం అర్ల సమీపం నుంచి ఘాట్ నిర్మించకుండా రహదారి వేయవచ్చని పలువురు ధర్మశ్రీకి వివరించారు. దానికి ఆయన స్పందించి రూట్ మార్జిన్, లైజనింగ్, స్థల సేకరణ, వ్యూపాయింట్స్ తదితర అన్ని అంశాలను పరిశీలించి నివేదిస్తే, ఆపై అధికారుల బృందాన్ని పంపిస్తానని సూచించారు. ఈ నేపథ్యంలో ఘాట్ లేకుండా చిన్నపాటి కాలిబాటనే విస్తరించి రోడ్డు వేయవచ్చని ఎమ్మెల్యేకు రాత పూర్వకంగా తెలియజేస్తామని ఈ సందర్భంగా ఎంపీపీలు తెలిపారు.

జగన్‌బాబే మళ్లీ రావాలి

● గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వ్యక్తం చేసిన వృద్ధులు
● దండిసురవరంలో ఇంటింటికీ తిరిగిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: ×జగన్‌బాబే మా కుటుంబాలకు అండాదండా.. మా బతుకుల్లో వెలుగులు నింపిన ఆ బాబే మళ్లీ అధికారంలోకి రావాలి€ అంటూ పలువురు వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం దండిసురవరంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంటింటికీ వెళ్లగా పై విధంగా వారు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పథకాలను వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా నూతన వాటర్ ట్యాంకు నిర్మాణానికి, ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ 97.88 లక్షలు, డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు, అంగన్‌వాడీ కేంద్రం-1 ఫ్లోరింగ్ నిర్మాణానికి రూ.1 లక్ష కేటాయించి పనులు చేస్తున్నట్లు వివరించారు. ఇద్దరు నిరుపేద ఇంటర్ విద్యార్థులకు ఫీజుల కింద రూ.13 వేలు, మానసిక దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించారు. ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలు తొలగించాలని, స్తంభాలు మార్పు చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ పిల్లలతో ముచ్చటించారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరం రెడ్డి సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, సర్పంచ్ కోన అర్జున, దండిసురవరం పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, సీనియర్ నేతలు కోన పైడినాయుడు, బొబ్బాది రాము, గంటా సత్యారావు, పిల్లా సత్యారావు, కోన వెంకటరావు, ఆదినాయుడు, బూసాల అప్పారావు, బత్తుల ఘాటీలు పాల్గొన్నారు.

నేడు కె.జె.పురంలో గడప గడపకు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి రాజారామ్, సర్పంచ్ జామి రమణబాబు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ సచివాలయ భవనం, ఎంపీపీ పాఠశాల నూతన భవనాలను ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

వేడుకగా వెంకన్న పెళ్లిరాట


స్వామివారి పెళ్లిరాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి 13వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పెళ్లిరాట వేశారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు మాస్టారు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, సభ్యులు కాళ్ల నర్సింగరాజు, రాపేట బాబూరావు, యల్లపు రాము, ఆడారి శ్రీను మాస్టారు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 30న స్వామివారి అంకురార్పణ, నిజరూప దర్శనం, 31న స్వామివారి ఎదురు సన్నాహం, అనంతరం కల్యాణం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 4వ తేదీతో పుష్పాంజలి సేవ, నాగవల్లి ఉత్సవాలతో ముగిస్తాయన్నారు.

సుందరకోటకు గ్రావెల్ రోడ్డు వేయిస్తా

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్


గిరిజనులు సమస్యలను నోట్ బుక్‌లో నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: మావోయిస్టు ప్రభావిత గిరిజన పంచాయతీ సుందరకోటలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుని స్వయంగా నమోదు చేసుకున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన తొలిసారి పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన వాడల్లో ఇంటింటికీ తిరిగి గిరిజనుల చెప్పే ప్రతి సమస్యను ఎమ్మెల్యే స్వయంగా నోట్ బుక్‌పై రాసుకున్నారు. వీటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చేస్తాన్నారు. ప్రధానంగా కొండలు మీద గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పిస్తామన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో ముందుగా మట్టిరోడ్డు గ్రావెల్‌గా మార్చుతానన్నారు. విద్య, వైద్యం, తాగునీటితోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి నాడు - నేడు నిధులు మంజూరు చేస్తానన్నారు. తర్వాత కృష్ణాపురంలో పర్యటించారు. ఇక్కడ తాగునీటి సమస్యతోపాటు వీధిలో సీసీరోడ్డు నిర్మిస్తామన్నారు. పేదలకు స్థలంలోపాటు ఇల్లు మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, ఆర్‌డబ్ల్యూస్ డీఈ ప్రభాకరరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, సర్పంచ్ కొండపల్లి చింతల్లి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపల్లి రాజు, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, ఏఎంసీ డైరెక్టర్లు అడిగర్ల నాయుడు, బండి గంగరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచులు ఉలబాల శ్రీనువాస్, కాళ్ల సత్యనారాయణ, గుడపర్తి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు కార్యక్రమం

శుక్రవారం వల్సంపేట పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. ఈ కార్యమ్రానికి పార్టీ శ్రేణులు విధిగా హాజరు కావాలని కోరారు.

బాక్సింగ్ క్రీడాకారిణులకు అభినందన


బాక్సింగ్ క్రీడాకారిణులతో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: బాక్సింగ్ క్రీడాకారుణులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం అభినందించారు. యూత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఉమెన్ బాక్సర్లు యర్రా తేజస్విని, బొంతు మౌనిక బంగారు పతకాలు సాధించారు. వీరికి ఎమ్మెల్యే జ్ఞాపికలు అందజేసి అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి నర్సీపట్నం నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ బాక్సర్ ప్రియాంక, డైరెక్టర్ పారుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం: భారీ వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో గురువారం సాయంత్రం గంట పాటు ఈదురుగాలులు, పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొండలఅగ్రహారం వద్ద విద్యుత్ లైన్‌పై చెట్టు విరిగిపడటంతో సరఫరా నిలిచిపోయింది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు చెట్టును తొలగించే పనులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

మండల పరిషత్ సూపరింటెండెంట్ మృతికి సంతాపం


రామచంద్రరావు నాయుడు (ఫైల్)

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మిడతాన రామచంద్రరావు నాయుడు హైదరాబాద్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందారు. ఆయన మృతితో ఇక్కడ కార్యాలయ సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గతేడాది జూలైలో ఇక్కడ విధుల్లో చేరినప్పటి నుంచి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ నెల 6న లంగ్స్ సంబంధమైన సమస్యతో తొలుత విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. తర్వాత హైదరాబాద్‌కు నాలుగు రోజుల క్రితం తరలించగా అక్కడ పరిస్థితి విషమించి మరణించారు. ఎంపీడీవో ప్రభాకరరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సీనియర్ అసిస్టెంట్ టి.ఎస్.వి.నాగేశ్వరరావు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, రోలుగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మద్దు తాతబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శెట్టి సత్యనారాయణమూర్తి, పోతల లక్ష్మీశ్రీనివాస్, గొర్లె చెల్లంనాయుడు, కొప్పుల వెలమ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

సమావేశ మందిరం ప్రారంభం


నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మాకవరపాలెం: మండల పరిషత్ సమావేశ మందిరాన్ని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి గురువారం ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సమావేశ మందిరం చిన్నదిగా ఉండటంతో సమావేశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో రూ.30 లక్షలతో నూతనంగా భవనం నిర్మించారు. ఇకపై ఇందులోనే సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, పార్టీ నేతలు పెట్ల భద్రాచలం, గొంతిన హరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

మరిడిమాంబకు 1.13 కేజీల వెండి హారం బహూకరణ

● ఎంపీపీ కిలపర్తి దంపతులకు కృతజ్ఞతలు

దేవరాపల్లి: స్థానిక మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు రూ.లక్ష విలువ చేసే వెండి హారాన్ని బహూకరించారు. తమ సొంత సొమ్ముతో తయారీ చేయించిన 1.13 కేజీల వెండి హారాన్ని ఆలయ ఆవరణలో గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామ పెద్దల సమక్షంలో వెండి హారాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వరదపురెడ్డి లలితానాయుడు, ఎల్లేటి కరుణాకర్‌నాయుడు, గుండు రాంబాబు, గండిపడాల అప్పలరాజు, వెత్సా రమేష్, సోమిరెడ్డి పేరునాయుడు, దీవి శంకరరావు, కొల్లి ఈశ్వరరావు, వరదపురెడ్డి చంద్రరరావు, బందం అప్పలరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం సహాయకులకు ఈకేవైసీ


ఈకేవైసీ చేస్తున్న ఎంఐసీ వేణు

రోలుగుంట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సహాయకులకు గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎం.ఐ.సి మద్దు వేణు ఈకేవైసీ నమోదు చేశారు. ప్రతినెలా జీతాలు అందించే నిమిత్తం ఎంఈవో సాయిశైలజ ఆదేశాల మేరకు మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 52 మందికి ఈకేవైసీ చేశారు.

ప్రతి పశువుకూ 'వైఎస్సార్ పశు బీమా'

● పశు సంవర్ధక శాఖ ఏడీ పుష్ప



రావికమతం: వైఎస్సార్ పశు బీమాతో రైతు ధీమాగా ఉండవచ్చని, తక్కువ ప్రీమియంతో ఎంతో మేలు చేస్తుందని పశుసంవర్ధక శాఖ రావికమతం అసిస్టెంట్ డైరెక్టర్ పుష్ప తెలిపారు. గురువారం ఆమె స్థానిక మాట్లాడుతూ పశువుకు ఒక సంవత్సరం ప్రీమియం చెల్లించినట్లయితే మూడేళ్ల పాటు బీమా వర్తిస్తుందన్నారు. ఇతర సంస్థలు ఏటా చెల్లించుకోవాలన్నారు. సంకర జాతి పశువులకు రూ.30 వేలు, దేశీయ జాతి పశువులకు రూ.15 వేలు, మేకలు, గొర్రెలు ఒకొక్కదానికి రూ.6 వేల చొప్పున బీమా సొమ్ము వస్తుందన్నారు. దీనికి ప్రీమియంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సంకర జాతి పశువులకు రూ.384, దేశీయ పశువులకు రూ.480, ఇతర వర్గాల వారు రూ.960 ప్రీమియం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలకు ఎస్సీ, ఎస్టీల వారు మూడేళ్లకు రూ.75, ఇతర వర్గాల వారు రూ.188 చెల్లించుకోవాలన్నారు. బీమా చేసిన పశువులకు ప్రమాదాలతోగానీ, రోగాలతో గానీ, పాముకాటుకు గానీ, ప్రకృతి విపత్తు వల్ల మృతి చెందితే తక్షణమే పరిహారం వస్తుందన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ నిర్మాణ పెద్దలకు చెక్కును అందిస్తున్న దాత

చీడికాడ: పెదగోగాడలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం నిర్మాణానికి కె.కోటపాడు మండలం రొంగలినాయుడుపాలెంకు చెందిన కొల్లి ఈశ్వరరావు, లక్ష్మి దంపతుల కుమారుడు నరేష్, కుమార్తె మమత రూ.50,116 విరాళం అందించారు. ఈ మొత్తం చెక్కును సర్పంచ్ కుమారుడు పైల వెంకటరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల తరఫున వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్.ఎం బత్తి వెంకటరమణ, బత్తి శ్రీను, గొర్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

వ్యాయామం ఆరోగ్యానికి మేలు


విద్యార్థులతో వ్యాయామం చేయిస్తున్న పీఈటీ ప్రభాకరరావు

నర్సీపట్నం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వ్యాయామంపై తర్ఫీదు ఇచ్చారు. పీఈటీ పి.ప్రభాకరరావు వ్యాయామం చేయించారు. వ్యాయామం చేయటం వల్ల ఆరోగ్యంగా ఉండడంతోపాటు చదువులో చురుగ్గా ఉంటారని, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. గ్రంథపాలకురాలు పి.దమయంతి పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో నీతికథల బోధన


నీతికథలు బోధిస్తున్న లైబ్రేరియన్

చోడవరం రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతికథల బోధన చేస్తున్నారు. గ్రంథాలయ అధికారి జి.తిరుమల కుమారి ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోఆపరేటివ్ కాలనీ ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నీతి కథలు చెప్పడంతోపాటు, పొడుపు కథలను నేర్పించారు. పిల్లలు వీటిని శ్రద్ధగా విని, పొడుపు కథల్లోని మర్మాలను ఆసక్తిగా తెలుసుకున్నారు.